క్లుప్తంగా

ఏటీఎంల పరిశీలన



కరూర్ వైశ్య బ్యాంకు ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్ఐ

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఏటీఎం కేంద్రాలను ఎస్ఐ సురేంద్రనాయుడు బుధవారం పరిశీలించారు. ఆయా ఏటీఎంల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా.. లేదా.. సక్రమంగా పని చేస్తున్నదీ, లేనిదీ.. సెక్యూరిటీ గార్డులు ఉన్నారా.. లేదా అని పరిశీలించారు. అనంతరం స్టేట్ బ్యాంకు మేనేజర్‌తో ఆయన మాట్లాడారు. ఏటీఎంల వద్ద దొంగతనాలు, సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అజెండా ఆమోదం



సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవదీసిన అంశాలకు, అజెండాలోని అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పట్టణంలోని ప్రధాన రహదారులపై వెలసిన ఆక్రమణలను తొలగించాలని సభ్యులు కోరారు. దీని వలన ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. అలాగే శ్మశాన వాటికలు బాగు చేయాలని, సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లంతా పచ్చజెండా ఊపారు. కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా రామమందిర ప్రారంభోత్సవం



పూజలందుకుంటున్న కోదండరామ స్వామి

సంతకవిటి: మండలంలోని మందరాడలో వేద పండితులు పులఖండం శ్రీనివాసరావుశర్మ, అంపోలు రుద్రకోటేశ్వరరావుశర్మల ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ప్రారంభోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు స్వామివారికి పూర్ణాహుతి, మహాశాంతి హోమం, జయాదులు, యంత్ర, మూర్తి శిఖర ప్రతిష్ఠలు, కళావాహన, ప్రాణ ప్రతిష్ఠలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామికి పూజలుచేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని పుర్లిలో అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని తమలపాకులతో అలంకరించారు. మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు జె. వీరభద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దిబ్బగుడ్డివలసలో విచారణ



విచారణ చేపడుతున్న దృశ్యం

బొబ్బిలి: ఇటీవల దిబ్బగుడ్డివలసలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారంటూ అధికారులు సస్పెండ్ చేసిన విషయం తెల్సిందే! బుధవారం ఏపీడీ జనార్దనరావు ఆధ్వర్యంలో మరోమారు విచారణ చేపట్టారు. గ్రామంలోని వేతనదారులు, ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నించారు. నివేదికను డ్వామా పీడీ, కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఏడీ తెలిపారు.

బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ అన్నారు. మండలంలని పనసలవలసలో పాడైన బోర్లకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల గోవిందరావు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నవరత్నాలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు



ఆదర్శనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు

రాజాం: ప్రతి ఇంట్లో నవరత్నాలు కనిపిస్తున్నాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన మాట్లాడుతూ, ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. వార్డుల్లో ఉన్న సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ, టీడీపీ నాయకులు గతంలో ప్రజలను దోచుకున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ప్రతి ఒక్క పేదవాడికీ న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే నవరత్నాలు అమలు చేస్తున్నారన్నారు. టీడీపీకి ఎట్టి పరిస్థితుల్లో అధికారం అప్పజెప్పకూడదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్ కుమార్, వెంపల లక్ష్మణరావు, ఓలేటి గణపతి, జేసీబీ శ్రీను, యందవ చినబాబు, ఎం.సాయిరాం, ఎస్.శ్రీహరినాయుడు, ఎస్.ఉమామహేశ్వరరావు, దన్నాన శ్రీను, దన్నాన చినబాబు, టి.నాగరాజు, యందవ జయప్రకాష్, అడపా శేషగిరిరావు, సవర వెంకటరావు, కూర్మారావు, మున్సిపల్ మేనేజర్ ఎంపీ నాగరాజు, పీవీ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



సోమరాజుపేటలో జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి: జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని, చీడపీడలు నివారించబడతాయని ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద అన్నారు. మండలంలోని ఉంగరాడ యూనిట్ పరిధిలోని సోమరాజుపేటలో కోట్ల నారాయణరావుకు చెందిన పంట పొలంలో వేసిన మినప పంటను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న మినప పంట ఆరోగ్యవంతంగా ఉందన్నారు. గ్రామంలోని 25 మంది సభ్యులతో ఐదు బృందాలుగా ఏర్పడి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీమాస్టర్ కిరణ్, ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, వీహెచ్ఏ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా సమగ్ర భూ సర్వే



రైతుల సమక్షంలో సమగ్ర భూ సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు, భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.బుచ్చయ్య అన్నారు. పాలకొండ - వీరఘట్టం రహదారిలో సమగ్ర సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం చేపట్టారు. రైతుల సమక్షంలో డ్రోన్ యంత్రాలతో ఈ ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణ పరిధిలో వార్డు సచివాలయాలకు సంబంధించి దశల వారీగా భూ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతుల, యజమానుల సందేహాలను నివృత్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు పి.వెంకటరావు, సచివాలయ సర్వేయర్లు నాగరాజు, మణి, వీఆర్వోలు బలివాడ సాయిశ్రీనివాస్, పాలవలస రమేష్, శ్రావణ సందీప్ జయసుధ, మేఘన, రామారావు తదితరులున్నారు.

ధూమపానంతో కేన్సర్ ముప్పు



సీహెచ్‌సీలో రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బాడంగి: ధూమపానం చేసే వారికి పలు రోగాలు వస్తాయని సీహెచ్‌సీ దంత వైద్యులు డాక్టర్ నాగశేఖర్ అన్నారు. ప్రపంచ ధూమపాన నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం వల్ల పలు రోగాలకు గురవుతున్నారు. ముఖ్యంగా కేన్సర్ వచ్చే ముప్పు ఎక్కువన్నారు. దీన్ని గుర్తించి ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజారమేష్, మేఘన, విశ్వనాథ్, ఆశా వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసంఘటితరంగ కార్మికులకు అండగా 'ఈ శ్రమ్'



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు

రాజాం: అసంఘటిత రంగ కార్మికులకు ఈ - శ్రమ్ అండగా ఉంటుందని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి. కొండలరావు అన్నారు. పట్టణంలోని రైతుబజార్ ఆవరణలో రైతులు, వ్యాపారులు, కార్మికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శ్రమ్ పోర్టల్‌లో కార్మికులు తమ వివరాలు నమోదు చేసుకుంటే ఇన్సూరెన్స్ బీమా రూ.1 లక్ష నుంచి 2 లక్షల రూపాయల వరకూ వర్తిస్తుందన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 94925 55044 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల నిరసన



దీక్ష చేస్తున్న ఉద్యోగులు

రాజాం: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీజీఈఏ (ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయూస్ అసోసియేషన్) సంఘ ఉద్యోగులు బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ విజయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, తాలూకా కార్యదర్శి డి.రాజశేఖర్, కోశాధికారి పి.గంగారామం, ఉపాధ్యక్షుడు ఎల్.లక్ష్మణరావు, తాలూకా ఇన్‌చార్జ్ పి.భూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారికే పనులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: జాబ్‌కార్డు ఉన్నవారికే ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని బొద్దాం, గురవాం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను తనిఖీ చేసి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

రాజాం సిటీ: పట్టణంలోని తెలగవీధి-సత్యనారాయణపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ నవమి వార్షికోత్సవం సందర్భంగా వైభవంగా బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు భట్టరు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తెర్లాం: చిన్నతనం నుంచి యోగాసనాలు వేయడం అలవాటు చేసుకోవాలని, యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రతకు దోహదపడుతుందని స్థానిక శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనంతో పాటు క్రీడల్లో పాల్గొనడం, యోగాసనాలు వేయడం వంటి వాటిపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు.

క్యాంపస్ నియామకాలు

బొబ్బిలి: ఐసీఐసీఐ, హెటిరో కంపెనీల్లో నియామకాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలలో స్థానిక రాజా కాలేజి విద్యార్థులు 56 మందికి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు లభించినట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్ర కుమార్ బుధవారం తెలిపారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శరత్‌కుమార్ సహకారంతో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు.

కొలతల మేరకు పని చేయండి

రేగిడి: కొలతల మేరకు పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీఓ ఎస్. హరినాథరావు అన్నారు. మండలంలోని మీసాల డోలపేట, వెంకంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం హాజరు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు, మేట్‌లకు సూచించారు. కార్యక్రమంలో టీఏ రాంబాబు, వేతనదారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

సంతకవిటి: మండలంలోని మండాకురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 'నాడు - నేడు' పనులను ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి బుధవారం పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని హెచ్ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖండ్యాంలో ఆయుర్వద వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాంలో బుధవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ, దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంలో మంచి మందులున్నాయన్నారు. కీళ్ల నొప్పులు, నడుము వ్యాధులను సులువుగా తగ్గించవచ్చని చెప్పారు. అనంతరం పలువురు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



సరసనాపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి

రేగిడి: భూముల రీసర్వేతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి అన్నారు. మండలంలోని సరసనాపల్లిలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో 789.55 ఎకరాల భూములకు సంబంధించి 402 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను రీ సర్వేతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ కర్రి అప్పలనాయుడు, సర్వేయర్ పోలిపల్లి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



చిననందబలగ ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ విగ్రహాలు

తెర్లాం: మండలంలోని చిననందబలగ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా వేదపండితులు గన్నవరపు సుబ్రహ్మణ్య శర్మ, చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ విగ్రహాలను ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య బుధవారం ప్రతిష్ఠించారు. సీతారాములకు ఘనంగా వివాహం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బాడంగి: రామాలయ ప్రతిష్ఠ పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ పూజలు

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామంలో సీతారామాలయ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా చేపట్టిన ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో భాగంగా చివరి రోజు బుధవారం పూర్ణకుంభం, స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేపట్టారు. ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉడమల అప్పలనాయుడు, ఎంపీటీసీ వంగంపు రమేష్, మాజీ ఎంపీటీసీ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వేతనదారులకు శతశాతం పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ఎస్సీ, ఎస్టీల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి శతశాతం పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఉపాధి క్షేత్ర, సాంకేతిక సహాయకులతో ఏపీఓ జగదీశ్వరరావు అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారుల సంఖ్యను ఘననీయంగా పెంచాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో జాబ్‌కార్డు లేని వారిని గుర్తించి వారందరికీ వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేయాలని అన్నారు. ఉపాధి ఏపీడీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు మరింత వేగంగా జరిగేలా చూడాలన్నారు. రోజువారీ వేతనం గిట్టుబాటు అయ్యేలా వేతనదారులతో పనులు చేయించాలన్నారు. ఉపాధి మండల ఏపీఓ జగదీశ్వరరావు మాట్లాడుతూ వేతనదారులకు వారి జాబ్‌కార్డు నంబర్, ఎన్ని రోజులుగా పని చేస్తున్నదీ, వేతనం ఎంత వస్తుందనే విషయాలు వారికి క్షేత్ర సహాయకులు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, ఉపాధి ఈసీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



భీమవరంలో లబ్ధిదారుకు పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని భీమవరం, చినభీమవరం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న పథకాలను వివరించారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే సచివాలయ సిబ్బంది, అధికారులను సంప్రదించాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు మేనిఫెస్టోను చూపి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు వివిధ సంక్షేమ పథకాలు పెడితే నేరమన్న చంద్రబాబు ఇప్పుడు ఎలా ఉచితంగా ఇస్తానని చెబుతున్నాడని ప్రశ్నించారు. ప్రజలే చంద్రబాబుకు గుణపాఠం చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు గెలుచుకుంటామన్నారు. భీమవరం, చినభీమవరం గ్రామాల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామనని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, యామల శివప్రసాద్, బేతపల్లి శంకరరావు, స్వామి, గండి శంకరరావు, చంటి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం



బాడంగి: దొంకినవలసలో వలంటీర్లకు సత్కారం



రేగిడి : బూరాడలో వలంటీర్లను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారాధిగా ఉన్న వలంటీర్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సన్మానిస్తున్నారు. నిస్వార్థంగా వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. - బాడంగి/రేగిడి